# ఒన్ బ్రైట్ సమ్మర్ మార్నింగ్

అప్పుడే తెల్లవారుతోంది. ప్రపంచానికి మరో ఉదయం మొదలవుతోంది. కానీ .... తనకీరోజు మామూలు రోజు కాదు.

తన జీవితంలో ముఖ్యమైన రోజు.

ముఖ్యమైన మలుపులోకి అడుగుపెడ్తున్న రోజు, అని అనుకుంది క్షమ. పరధ్యానంగానే తయారైంది. టైం దగ్గరవుతున్న కొద్దీ. గుండె అతి వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. తెలీకుండానే భయం, ఆలోచనలు.

అతి కష్టం మీద మామూలుగా ఉండడానికి ప్రయత్నం చేస్తోంది.

సూట్‌కేస్ తీసుకొని ముందు గదిలోకి వచ్చింది క్షమ.

అక్కడ చిన్నన్నయ్య తప్ప అంతా ఉన్నారు.

అందరూ తనకు బెస్టాఫ్‌లక్ చెప్పడానికి రెడీగా ఉన్నారు.

ఇంత మందిని మోసం చేస్తూ వెళ్తోంది.

ఒక్కసారి కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"సుబ్రమణ్యం ఏడీ?" అంది మామూలుగా ఉండడానికి ప్రయత్నం చేస్తూ.

"ఆటో కోసం వెళ్లాడు. వాడు స్కూటర్ మీద నిన్ను స్టేషన్‌లో దింపుతానంటే వద్దన్నావు మరి!" అంది తల్లి నిష్ఠూరంగా.

"అవును! వద్దన్నాను. ఎందుకని వద్దన్నాను? అక్కడ స్టేషన్‌లో నా కోసం ఎదురుచూస్తున్న నిశాంత్‌ని సుబ్రమణ్యం చూసే .... రెండు నెలలుగా వేసుకుంటున్న ప్లాన్ తలకిందులయిపోతే .... అందుకని వద్దన్నాను" అని మనసులో అనుకుంది క్షమ.

"తులసెమ్మకి ప్రదక్షణం చేశావా?"

లేదన్నట్లు తలూపుతూ తల్లికేసి చూసింది.

"వెళ్ళి చేసిరా. ఇంటర్వ్యూ బాగా చేస్తావు?" అని ఆప్యాయంగా అంటున్న తల్లికేసి బెంగగా చూసింది.

పెరట్లోకి వెళ్ళి తులసికోటకి ప్రదక్షణాలు చేసి, ఓ ఆకు తుంచి తల్లో పెట్టుకుంది.

ఆటో వచ్చి ఆగిన శబ్ధం అయింది.

"వెళ్తున్నాను" అంది నీళ్ళు నిండిన కళ్ళతో.

"వెళ్ళొస్తాను అని అను" అంటూ మందలించింది తల్లి.

"ఊహుఁ....నేను తిరిగి రావడం లేదు. ఈ మాటలు మనసులోనే అనుకుంది క్షమ. అంతా ఏవో సలహాలు ఇస్తున్నారు. అవేవీ వినపడ్డం లేదు. నిన్న రాత్రి 'సవేరా' లో కాండిల్ లైట్ డిన్నర్ చేస్తున్నప్పుడు తియ్యగా మాట్లాడిన నిశాంత్ మాటలే చెవుల్లో వినబడుతున్నాయి. తెలీకుండానే పెదవులు నవ్వుతో విచ్చుకున్నాయి.

"ఇప్పట్నుంచీ ఉద్యోగం వద్దంటే వినవు. హాయిగా చదువుకో అంటే వినడం లేదు. ఊఁ.... క్షేమంగా లాభంగా రా!" తండ్రి మాటలకి తలూపింది.

నాగపూర్ నుంచి వచ్చేప్పుడు సంత్రాలు తీసుకు రా !" అన్నయ్య.

" నేను తిరిగి వచ్చినప్పుడు కదా!" అని అనుకుంది క్షమ.

ఆటో ఎక్కింది. అంతా 'బెస్టాఫ్‌లక్' చెప్పారు. చేతులూపారు ఆటో కదిలింది.

ఎక్కడో నరాల్లోంచి భయం.

తను ఏం పని చేస్తోంది?

తప్పటడుగు వేస్తోందా?

నేను నాగపూర్ ఇంటర్వ్యూకి వెళ్ళడం లేదు. మన పక్కింటబ్బాయి నిశాంత్‌తో ఢిల్లీ వెళ్తున్నాను. అక్కడ నిశాంత్ తల్లిదండ్రులు మా పెళ్ళి చేస్తారు. ఈ విషయం ఇంట్లో ధైర్యంగా చెప్పలేకపోయింది. అబద్ధం చెప్పి, ఇంట్లోంచి వెళ్ళిపోతోంది.

ఎందుకని?

తనకి పెళ్ళంటే ఇష్టం. పెళ్ళికావాలి. తనపైన ఉన్ననలుగురికి పెళ్ళిళ్లయ్యే దెప్పుడు? తనకి లైన్ క్లియర్ అయ్యేదప్పుడు?

"మేమిద్దరం పెళ్ళి చేసుకుంటున్నాం. ఆశీర్వదించండి" అని అంటే ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరక్కయ్యలు, అన్నయ్య, ఇంజనీరింగ్ చదువుతున్న చిన్నయ్య చూపులెలా ఉంటాయో ఊహించుకుని చెప్పలేదు ఇంట్లో.

"నీపై వాళ్ళకి పెళ్ళిళ్ళవలేదు. నీకు అప్పుడు పెళ్ళేవిటి? అని అనకపోయినా తల్లి చూపుల్లో అదే అర్థం ఉంటుంది. అని ఊహించి చెప్పలేదు.

ఏమీ అనకపోయినా తండ్రి చూపుల్ని అర్థం చేసుకోగలదు.

అందుకే చెప్పలేదు. చెప్పలేకపోయింది.

అయితేనేం. అన్నీ కూడా వివరంగా ఓ ఉత్తరంలో రాసింది. కానీ ఆ ఉత్తరాన్ని ఏ టేబిల్ మీదా, దేవుడి పటం దగ్గర ఇంట్లో వాళ్ళకి కనబడే విధంగా పెట్టలేదు.

జాగ్రత్తగా సూట్‌కేస్‌లో పెట్టింది.

తనతో ఆ సూట్‌కేస్ తెచ్చుకుంది. ఏదో ఓ స్టేషన్‌లోనో, లేకపోతే ఢిల్లీలోనో పోస్ట్ చేద్దామని.

ఆటో సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది. డ్రైవర్‌కి డబ్బిచ్చి సూట్‌కేస్ తీసుకొని లోపలికి నడిచింది.

నవ్వుతూ నిశాంత్ కనబడ్డాడు.

'హమ్మయ్య' అని మనసులోనే అనుకుని నవ్వింది.

'బేడ్‌లక్ క్షమా!" రెండుసీట్లున్న కూపే దొరకలేదు." అంటూ సూట్‌కేస్ నందుకున్నాడు.

క్షమ నిశాంత్ మాటలు వినలేదు.

"ఎందుకో భయంగా ఉంది నిశా" అంది మనుషుల్ని తప్పుకుంటూ నడుస్తూ.

"మీ వాళ్ళకి చెప్తానంటే వద్దన్నావు"

"నా భయం నాది"

"వద్దు. ఇంక భయం అనకు. నా మీద నమ్మకం ఉందా? నా తల్లిదండ్రుల్ని చూశావు కదా. వాళ్ళమీద నమ్మకం ఉందా?"

"ఉందన్నట్లు" తలూపింది క్షమ.

"మరి ఇంక భయపడాల్సిన అవసరం లేదు. చేస్తున్న తప్పు ఒక్కటే. మీ వాళ్ళకి తెలీకుండా వెళ్ళటం. ఇంకో రెండు రోజుల్లో ఎలాగూ తెలుస్తుంది. అయినా,

ఇంక దాని గురించి మాట్లాడుకోవద్దు. కొత్తజీవితానికి స్వాగతం పలకడానికి ఎదురెళ్తున్నాం." అంటూ ఫస్ట్‌క్లాస్ కూపేలోకి వెళ్ళాడు.

పై బెర్త్ మీదున్న సూట్‌కేస్ ప్రక్కనే క్షమ సూట్‌కేస్‌ని పెట్టాడు.

కిటికీ దగ్గరగా కూచుంది క్షమ, మనసులో ఏదో తెలియని భయం ఆమెని ఆవరిస్తూ ఉంటే.

ఎదురు కిటికీ దగ్గర నిశాంత్ కూచున్నాడు క్షమ వేసే తదేకంగా చూస్తూ.

రెండు కిటికీలకీ మధ్య చిన్న బల్లుంది. దాని మీద ఫ్లాస్క్ చిన్న చిన్న ప్యాకెట్లున్నాయి. తన కాళ్ళతో ఆమె కాళ్ళని తొక్కుతూ ముందుకు ఒంగాడు నిశాంత్.

"కొంచెం కాఫీ ఇవ్వనా?" చాలా మృదువుగా అడిగాడు.

తలూపింది.

ఫ్లాస్క్ మూతలో కాఫీ పోసి ఇచ్చాడు. పెదవులు విడకుండా నవ్వుతూ, కాఫీ అందుకుంటూ నిశాంత్ మొహంలోకి చూసింది.

"నా ఎన్నిక తప్పుకాదు. నిశాంత్ డబ్బున్నవాడు. తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు. తన లాగే ఫ్రెష్ గ్రాడ్యుయేట్. ఉద్యోగం ఇంకా రాకపోతేనేం. ఫరీదాబాద్‌లో వాళ్ళకి ఓ ఫ్యాక్టరీ ఉంది. పెద్ద ఇల్లుంది. తండ్రి బిజినెస్‌లోనే తనూ చేర్తాడు. తనంటే చాలా ఇష్టం. తల్లిదండ్రులు వేరే అమ్మాయిని చేసుకోమంటున్నా వినకుండా వాళ్ళని ఒప్పించి తనని పెళ్ళి చేసుకోబోతున్నాడు, ఈ నిశాంత్. తన సుఖం కోరే మనిషి. తనేం తప్పు చెయ్యడం లేదు.

ట్రెయిన్ కదిలింది. ఇంకా సూర్యోదయం కాలేదు.

కిటికీలోంచి చల్లగాలి తగిలేటప్పటికి ఇద్దరికీ ఉత్సాహం వచ్చింది.

"స్ప్రింగ్ ఎఫైయిర్" అంటూ డోనాసమ్మర్ పాట పాడ్తున్నాడు. నిశాంత్. ఆ పాట తన కిష్టం. అందుకే పాడ్తున్నాడు.

"నిజానికి నిశాంత్‌కి పాడటమంతగారాదు. కానీ తనకు నచ్చిన పాట కాబట్టి నేర్చుకుని మరీ పాడ్తున్నాడు.

ఒక్కసారి నిశాంత్ వంక ఓరగా చూసింది క్షమ ఓ క్షణం పాటు.

"జస్టేమిటి" అంటూ తను కూడా పాటనందుకుంది, తాగిన ఫ్లాస్క్ మూతని కడగడానికి లేస్తూ.

"వెయిటేమినిట్" అంటూ అదే రాగంతో పాడ్తూ ఆమె చేతిలోని ఫ్లాస్క్ మూతని తను తీసుకెళ్ళాడు.

క్షమకి ఏదో లోకంలో తేలిపోతున్నట్లుంది. అబ్బా! ఎంత ఆనందంగా ఉందో అనిపించింది.

ప్రేమా! పెళ్ళి, భర్త, జీవితం ఇంత హాయిగా ఉంటుందా? తిరిగివచ్చి కూపే తలుపువేసి క్షమ ప్రక్కనే కూచున్నాడు నిశాంత్. కొత్త ఆశలతో నిండిపోయిన ఆ ఇద్దరినీ, ఆ ట్రెయిన్ కొత్త జీవితంలోకి ఇంకా ఫాస్ట్‌గా తీసుకెళ్తోంది.

పదునుగా లేకపోయినా ఎండ ఒక్కసారిగా వచ్చేసింది. సమ్మర్ ఫీవర్ అంటూ ఇద్దరూ కలిసి పాడడం మొదలెట్టారు. మధ్య మధ్య పెళ్ళి గురించి, గడపబోయే కొత్త జీవితం గురించి మాట్లాడుకుంటున్నారు.

తలుపుకొట్టిన శబ్దం.

విసుగ్గా లేచాడు, తలుపు తీయడానికి.

రెండు సీటున్న కూపే కాసందుకు ఆ క్షణంలో చాల ఫీలయింది.

టీ.సీ. లోపలి కొచ్చాడు.

నిశాంత్ టిక్కెట్లు తీసి ఇచ్చాడు

"ఈ సీట్లలో వాళ్ళు....." అంటూ ఎదురు సీట్లు చూపాడు.

"వాళ్ళు కాజీపేటలో ఎక్కుతారు" అనేసి టీ.సీ. వెళ్ళిపోయాడు.

తామిద్దరూ, ఒంటిగా ఈ కూపేలో .... ఆ ఆలోచనకే సిగ్గు పడిపోయింది క్షమ.

తలుపేసి, క్షమ ప్రక్కనే కూచున్నాడు.

"మొహబ్బత్‌కి రాహోమేఁ చల్‌నా సంబల్‌కే.

యహాఁ జోభీ ఆయా గయా హాథ్‌మల్‌నే!"

అంటూ క్షమ మెల్లగా పాడ్తోంది.

కాస్సేపయ్యాక వాళ్ళ ఫాం హౌస్ గురించి చెబుతున్నాడు.

తన్మయంగా వింటోంది.

రేపట్నుంచి అంత పెద్ద ఇంట్లో తనూ ఓ భాగమైపోతుంది.

ఆ మనుషుల్లో తనూ ఒకటై కలిసిపోయింది.

స్వర్గానికి ఓ మెట్టు క్రింద విహరిస్తున్న ఆ ఇద్దర్నీ తలుపు చప్పుడు ఈ లోకంలోకి తీసుకొచ్చింది.

కాజీపేట వరకూ ఏ డిస్టర్బెన్స్ ఉండదు అని అనుకుంటే ...... ఈ తలుపు చప్పుడేమిటి?

కోపంగా, విసుగ్గా తలుపుతీశాడు నిశాంత్.

క్షణాల్లో దూసుకుంటూ లోపలికి కొచ్చాడు ఓ యువకుడు.

నిశాంత్‌ని ప్రక్కకి తోసి తలుపులు మూశాడు.

ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా, పరీక్షగా ఆ యువకుని కేసి చూశారు క్షమ, నిశాంత్‌లు.

ఆ యువకుని వాటం, చూపులు మామూలుగా లేవని, వాళ్ళకిద్దరికీ అర్థమైపోయింది.

"ఎవర్నువ్వు" [illegible]ం కూడదీసుకుంటూ అడిగాడు నిశాంత్.

"కిటికీ తలుపులు వెయ్యి." నిశాంత్‌ని చూస్తూ కరకుగా అన్నాడు ఆ ఆగంతకుడు.

"నిశాంత్" అంటూ భయంగా చూసింది క్షమ.

"కిటికీ తలుపులు వేసి కళ్ళు మూసుకోండి" అంటూ పెద్దగా అరిచాడు ఆ అగంతకుడు.

నిశాంత్ కదల్లేదు.

వెంటనే అతను పాంట్ జేబులోంచి రివాల్వర్ తీశాడు. అది నల్లగా మెరుస్తోంది. నిశాంత్ కేసి గురిపెట్టి "ఒక్క రెండు నిముషాల్లో మీరిద్దరూ చచ్చిపోతున్నారు అర్థమైందా? కిటికీ తలుపులు వెయ్యండి" అన్నాడు.

క్షమ లేచి ఓ వైపు కిటికీ తలుపుదించుతున్న మిశతో గబుక్కున సీటు మీద కెక్కింది. గొలుసులాగుదామని చెయ్యి పై కెత్తింది. "చెయ్యి దింపు" అంటూ ఆమె వైపు రివాల్వార్ తిప్పాడు. నిస్సహాయంగా నిశాంత్ వైపు చూస్తూ కిందికి దిగింది క్షమ. నిశాంత్ పక్కన కూర్చోంది.

"వెరీగుడ్ .... ఇప్పుడు ఇద్దర్నీ చంపడం ఇంకా తేలిక" అంటూ నవ్వాడు, మెల్లిగా.

పక్క కూపేలో వాళ్ళకి వినబడేంత భయంకరంగా నవ్వలేదు.

క్షణాల్లో ఏం జరుగుతుందో తెలిసిపోయింది క్షమకి.

"డబ్బు కావాలంటే తీసుకో, మా దగ్గర ఉన్నదంతా ఇచ్చేస్తాం. కానీ ... మమ్మల్ని చంపకు." అన్నాడు నిశాంత్ జాలిగా.

ఈ లోపల క్షమ సీటు మీదకి వంగి, ప్రక్క కూపేలో వాళ్ళకి వినబడేటట్లు కొట్టింది.

"అలా కొడితే వాళ్ళకేం తెలుస్తుంది? ఇక్కడేదో జరుగుతుందని అనుకోరు. ఓ ఐదు నిమిషాలు ఆగకుండా కొడితే అప్పుడు తెలుస్తుంది. ఇక్కడేదో ఘోరం జరుగుతోందని. సరే ఇంక కళ్ళు మూసుకో .... వన్ ...."

"ప్లీజ్ ! మమ్మల్ని చంపకు. నీకేం కావాలో చెప్పు." అన్నాడు జాలిగా నిశాంత్.

"నాకేం అక్కర్లేదు. ఈ రివాల్వర్‌కి ఆకలేస్తుంది. ఊఁ ఇంక కళ్ళుమూసుకో."

"వద్దు. నన్ను చంపకు మా వాళ్ళకు నేనొక్కణ్ణే! చేతులు రెండు అడ్డంగా ఊపుతూ అన్నాడు.

"సరే! ఈమెనే చంపుతా! వన్ .... టూ..... త్రీ...

"ఆమెను చంపకు. నాక్కాబోయే భార్య" అని అంటాడేమో అని నిశాంత్ కేసి చూసింది క్షమ.

ఆ గంతకుడు క్షమ కేసి గురి చూస్తున్నాడు.

"నా కింకా బతకాలని ఉంది. నన్ను చంపకు. నీకు పుణ్యం ఉంటుంది." అని ఏడుస్తూ సీటుకు చేరగిలబడింది క్షమ.

ఈ విధంగా రైల్లో చావు వస్తుందని, కల్లో కూడా అనుకోలేదు.

ఎదురుగా పిస్తోలు రూపంలో మృత్యువు.

వణికిపోతోంది క్షమ.

మృత్యువు సమీపిస్తోంటే ఇంత భయంగా....

ఇంత భయంకరంగా ఉంటుందా?

ఎవరో ఈ మనిషి తనని చంపుతానంటే ఈ నిశాంత్ ఏం చెయ్యలేకపోతున్నాడేంటి తనైనా అరవాలి గట్టిగా .... ఈ కంపార్ట్‌మెంట్ అంతా వినబడేటట్లుగా అరవాలి. తనని తానే రక్షించుకోవాలి.

"వన్"

"నిశాంత్! ప్లీజ్ డు సంథింగ్" అంటూ ఒక్కసారిగా గట్టిగా నిశాంత్‌ని పట్టుకుంది.

నిశాంత్ ఆమె చెయ్యి విడుల్చుకున్నాడు.

క్షమ ఆశ్చర్యంగా నిశాంత్ వైపు తలెత్తి చూసింది.

నిశాంత్ ఆ ఆగంతకుని వైపే చూస్తున్నాడు.

బయట ఎవరో తలుపులు కొడ్తున్నారు

ఓ అడుగుముందు వేసింది క్షమ, తలుపుతీద్దామని.

"కదలకు .... వన్ ...."

"బయట ఆగని తలుపు చప్పుడు.

"ఊ! త్వరగా... బయట ఎవరో తలుపు కొడ్తున్నారు కూడ.

సరే... ఈమె చావనంటోంది. నువ్వు రెడీగా ఉండు."

అంటూ నిశాంత్‌కి దగ్గరగా వచ్చాడు.

"వద్దు. అతన్ని చంపకు...." ఏడుస్తూ అంది క్షమ.

ఒక చేత్తో క్షమని సీటు మీదకి తోసి....."వన్"

నిశాంత్ క్షమకి దగ్గరగా కదిలాడు.

క్షమ సీటు మీద నుంచి లేచి నిశాంత్ ప్రక్కగా నిల్చుంది.

"తలుపుతీయ్యండి ..... తలుపు తియ్యండి" బయట గట్టిగా చప్పుడు.

"టూ....."

నిశాంత్‌కి, క్షమకి ఏం చెయ్యాలో తెలియటం లేదు.

"వద్దు.... అతన్ని చంపకు ...." అంటూ ముందుకు రాబోయింది.

క్షమని పక్కకి తోశాడు. ఈసారి క్షమ సీటు మీద పడలేదు.

నిశాంత్‌ని పట్టుకుంది.

"త్రీ"....

ఆ క్షణానికే నిశాంత్ క్షమని అడ్డుగా, తన ముందుకు లాగాడు.

"నిశాంత్! ... నువ్వా .... నన్నా ..... నువ్వు ......

పిస్తోలు పేలింది.

క్షమ భయంతో కళ్ళు మూసుకుంది.

బయట దబదబా చప్పుడు.

ఆ ఆగంతకుడు ఆ పిస్తోలుని పాంటులో దాచేసి తలుపుతీశాడు.

"ఆనందూ .... ఏం చేస్తున్నావురా? అంటూ లోపలికి ఓ పెద్ద మనిషి వచ్చాడు.

"ఇందాకట్నించి తలుపుకొడ్తున్నా తియ్యలేదేం? వినపళ్ళేదా?"

అతని వెనకే టీ.సీ., ఓ నడివయసావిడా ఉన్నారు.

"చూడండి ఈ అబ్బాయి..... అంటూ ముందుకొచ్చాడు నిశాంత్ వాళ్ళకేసి చూస్తూ.

"ఆనందూ! ఇంక రామ్మా!" అంటూ ఆ పెద్ద మనిషి ఆ యువకుని చేయిపట్టుకున్నాడు.

"చూడండి. ఈ అబ్బాయి పిస్తోలుతో ఈ అమ్మాయిని కాల్చాడు" అన్నాడు నిశాంత్ టీ.సీ తో

"అదా .... అది దీపావళి పిస్తోలుతెండి. చూడండి ఆ అమ్మాయి కళ్ళు తెరచి ఇటే చూస్తోంది" అన్నాడు టీ.సి.

"అంటే ఈ అబ్బాయి...." ఆగిపోయాడు నిశాంత్.

"కొంచెం"...... అంటూ కణతల దగ్గర చూపుడు వేలుని గాలిలో తిప్పాడు.

"అయితే కట్టెయ్యాలి కానీ .... ఇలా వదిలేస్తారా? ఎంత భయపెట్టాడు? ఎంత ఖంగారు పెట్టాడు?" కోపంగా అన్నాడు నిశాంత్.

"దానికి క్షమార్పణలు చెప్పుకుంటున్నాం. టీ.సీ.తో ఈ గుమ్మం దగ్గరే మాట్లాడుతున్నాం. ఈ ప్రక్క కూపేమాది. మీ కూపేలోకి వెళ్ళడం చూశాం. ఈ టీ.సీ. నా చిన్నప్పట్నుంచి ఫ్రెండ్. ఈ ఆనంద్ గురించే మాట్లాడుకుంటున్నాం. సరిగ్గా ఐదు నిముషాలు అయిందో లేదో...సారీ...రా బాబూ" అంటూ ఆనంద్‌ని తీసుకెళ్ళారు. ఆనంద్ కూడా ఏమీ ఎరగనట్లు బుద్ధిగా వాళ్ళవెంట వెళ్ళాడు.

తలుపువేసి ఎదురుసీట్లో కూర్చున్న నిశాంత్‌కేసి చూసింది క్షమ.

"క్షమా..."అంటూ ఏదో అనబోయాడు.

"ప్లీజ్..." అంటూ చేతులు జోడించింది.

"ఆ అబ్బాయి పిచ్చి: డు."

"చేతిలో ఉన్నది మామూలు బొమ్మ పిస్తోలు కాబట్టి బ్రతికిపోయాను. లేకపోతే... అంతే... తను చచ్చిపోయేదే"

కానీ...ఆ స్వల్ప వ్యవధిలోనే జీవనగతిని మార్చేశాడు.

ఆ గడిచిపోయిన భయంకరమైన పదినిముషాలు తన భవిష్యత్ గురించి కన్న కలల్ని, ఈ నిశాంత్‌ని గూర్చి, తన అభిప్రాయాల్ని మార్చేసింది.

"ఇంటర్ ఆఖరి సంవత్సరం నుంచి బస్‌స్టాపులో పరిచయమైన నిశాంత్‌ని... బి.ఎస్సీ ఆఖరి సంవత్సరం వరకు స్నేహితుడిగా ఉన్న ఈ నిశాంత్‌ని...చదువయ్యాకా పెళ్ళిచేసుకుందాం అన్న ఈ నిశాంత్‌ని ఈ నాలుగేళ్ళలో బాగా అర్థం చేసుకున్నా అనుకుంది. కానీ తన అంచనాలు తప్పు."

"ఇదా ఇతని ప్రేమ. ఈ వ్యక్తినా తను ఎంతో ఉన్నతంగా ఊహించుకుంది? ఇలాంటి వాడికోసం ప్రేమని, ఆప్యాయతని పంచి ఇచ్చే తన వాళ్ళనందర్నీ దూరం చేసుకుందామనుకుంది?

మూసిఉన్న కిటికీకి తల ఆన్చి కళ్ళు మూసుకుంది.

కొద్ది క్షణాల వరకు...ఈ నిశాంత్‌తో పంచుకోబోయే తియ్యటి జీవితాన్ని గురించి ఆలోచించింది. ఆ తియ్యటి జీవితాన్ని గూర్చి, ఇంకా మధురంగా ఊహించుకుంది. ఇద్దరూ కలిసి వేసిన దారి పూలదారి అవుతుందని అనుకుంది. కానీ...కలసి వేసిన మొదటి అడుగులో అపశ్రుతి పలికింది. కళ్ళు తెరిచింది.

తప్పు చేసినవాడిలా ఉన్న నిశాంత్‌ని చూస్తే అసహ్యం కలిగింది. ఉత్త అవకాశవాది.

కిటికి తలుపు తెరిచింది. వేడిగా, బ్రైట్‌గా ఉంది బయట.

పైనుంచి పెట్టెతీసి, అందులోంచి ఉత్తరం తీసింది.

ఆ ఉత్తరం తల్లిదండ్రులకి రాసిన ఉత్తరం.

ఇంకా ఏదో ఓ స్టేషన్‌లోనో, ఢిల్లీలోనో పోస్ట్ చేద్దామనుకున్న ఉత్తరం.

ఆ ఉత్తరం ముక్కలు ముక్కలుగా చేసింది.

కిటికీలోంచి ఆ ముక్కల్ని బయటపడేసింది.

"ఘటకేసర్" స్టేషన్ దాటింది రైలు.

పెట్టె మూసి ప్రక్కనే పెట్టుకుంది.

కాజీపేట కోసం చూస్తోంది.

కాజీపేట రాగానే రైలు దిగి, ఏదో ఓ ట్రైన్‌లోనో లేకపోతే బస్సులోనో హైదరాబాద్ తన ఇంటికి వెళ్ళి పోవాలనుకుంది.

"నేనింకా చదువుకుంటాను.... ఉద్యోగం చెయ్యాలని లేదు" అని ఇంట్లో అందరికి చెప్పాలని.

ఎండ ముదిరింది. ఆ వేడిలోని సందేశంతో ఆమె నిశ్చింతగా కిటికీలోంచి బయటికి చూస్తోంది.

*❖ జులై 1991 ఆంధ్ర ప్రభ వార పత్రిక ❖*

❖❖❖

కథా నిలయం
5974
శ్రీకాకుళం